ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్

-8 వేల మంది విద్యార్థులకు లబ్ధి
-కళాశాలల విద్యార్థులకు పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని గత కొన్ని రోజులుగా విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్స్ అందజేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్ తో పాటు బ్యాగులను కూడా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 18 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. కళాశాలలో దాదాపుగా 8వేల మందికి పైగా ప్రథమ , ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో టీటీడీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను ముద్రించి అందజేసేవారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందక తీవ్ర అవస్థలు పడేవారు. ప్రైవేట్ కళాశాలలో చదివే విద్యార్థులకు సంబంధిత కళాశాల యాజమాన్యాల అందజేసేవారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మాత్రం పాఠ్య పుస్తకాలు అందకపోవడంతో కేవలం గైడ్స్ ,మెటీరియల్స్ ద్వారానే పరీక్షలకు సన్నతమయ్యేవారు. ఇటీవల కాలంలో ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నపాలు చేశారు. ఎట్టకేలకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ ఉచితంగా సరఫరా చేయాలని భావించింది. అందుకు అనుగుణంగా మొదటి విడుదల విద్యార్థులకు నోట్ బుక్స్ బ్యాగులను అందజేశారు. ఈ నెలాఖరులోగా పాఠ్య పుస్తకాలను కూడా ముద్రించి విద్యార్థులకు అందజేయనున్నారు. ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు అందజేయడంతో ప్రభుత్వ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశాలు ఉంటాయని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు.

నెలాఖరులోగా పంపిణీ చేస్తాం
జిల్లావృత్తివిద్యాశాఖ అధికారి పరమేశ్వర్ రెడ్డి



జిల్లాలో ప్రభుత్వ కళాశాలలో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే కళాశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ బ్యాగులను అందజేశాం. ఈ నెలాఖరుకల్లా పాఠ్య పుస్తకాలు విద్యార్థులందరికీ అందజేస్తాం.

మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం
జీలాలప్ప ,ప్రిన్సిపల్ కెవిఆర్ మహిళా జూనియర్ కళాశాల



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్స్ అందజేశాం. ప్రస్తుత విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే పంపిణీ కూడా ప్రారంభించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల వల్ల ఎక్కడా ప్రజలకు నష్టం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు. శనివారం మండల, జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నది ప్రవాహ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షితంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. తాగునీటి కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు మండల కేంద్రంలో నుండి క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేయాలన్నారు.



కుంగిపోతున్న హంద్రీ బ్రిడ్జి

ప్రమాదం పొంచివున్నా పట్టించుకోని కాంట్రాక్టర్
స్పందించని హైవే అథారిటీ అధికారులు
పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో వంతెన వద్ద నిరసన

ప్రజాశక్తి-కర్నూలుక్రైమ్ : రెండు వరసల రోడ్డుకు తగినట్లుగా గతంలో హంద్రీనదిపై బ్రిడ్జి నిర్మించారు. ప్రస్తుతం నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చెంది ప్రతిరోజు 50-150 టన్నుల బరువుతో వందలాది భారీ వాహనాలు తిరగడంతో బ్రిడ్జి రోజురోజుకు కుంగి పోతుంది. ప్రమాదం పొంచి ఉన్నా...బ్రిడ్జి నిర్వహణ పట్ల జాతీయ రహదారి నిర్వహణ కాంట్రాక్టర్ ఏమాత్రం పట్టించుకోవడంలేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎండి.యూనుస్, సివి.వర్మ, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఎస్‌కె షబ్బీర్‌లు విమర్శించారు. మరమ్మత్తుల పేరుతో నెలల తరబడి వాహనాలను దారి మళ్లిస్తున్నారని, ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని వాహనదారులు బ్రిడ్జి దాటుతున్నారని తెలిపారు. వందలాది వాహనాలు నిలిచిపోవడాన్ని తెలుసుకున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు ఆ ప్రాంతంలో పర్యటించి అనంతరం అక్కడే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకు కుంగిపోతున్న బ్రిడ్జి గురించి శాస్త్రీయమైన చర్యలు చేపట్టకుండా నాసిరకం మరమ్మతులు చేస్తూ నెలల తరబడి వాహనాలను దారి మళ్ళించి ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఏ నిమిషములో ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాన్ని అరిచేతిలో పెట్టుకుని బ్రిడ్జిపై వాహనదారులు ప్రయాణిస్తున్నారని అన్నారు. ఒకవైపు టోల్గేట్ రుసుం వసూలు చేసుకుని రూ.కోట్లు దండుకుంటున్న కాంట్రాక్టరు, మరోవైపు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ పై పన్నులు, రోడ్డు టాక్స్ , గ్రీన్‌టాక్స్ లు పెంచుతూ వాహనదారుల భద్రతను గాలికి వదిలేసారని అన్నారు. జాతీయ రహదారులకు ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మాణంతో పాటు వాటికి అనుసంధానంగా అదనపు బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జిపై జరిగిన పర్యటన అనంతరం జరిగిన ఆందోళనలో సంఘం నగర నాయకులు కె. శ్రీనివాసులు, ఎల్ నయూమ్, ఎస్.కె రహిమాన్, రాజు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ స్కీం వర్కర్ల పై వేధింపులు, తొలగింపులు ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్ అన్నారు. శనివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ప్రభుత్వ స్కీం (అంగన్వాడి,ఆశ,మధ్యాహ్నం భోజనం, విఒఎ,విఆర్ఎ,ఆర్‌పి.)వర్కర్ల జిల్లా విస్తృత సమావేశం ఎపి అంగన్వాడి వర్కర్స్ యూనియన్(సి.ఐ.టి.యు) జిల్లా కార్యదర్శి కె.వెంకటమ్మ అధ్యక్షతన నిర్వహించారు. డి.గౌస్ దేశాయి, జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబు (టిడిపి.) ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తారని గంపెడు ఆశతో ఎదురు చూస్తున్న స్కీం వర్కర్లకు రాజకీయ వేధింపులు, తొలగింపులు ఎదురవుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో వారి సమస్యలపై అంచలంచెలుగా పోరాటాలు చేసిన ప్రయోజనం కనబడకపోవడంతో కసితో ఆ ప్రభుత్వాన్ని ఓడించడంలో కీలకపాత్ర వహించారు. అటువంటి వారిపై ఈ నెల రోజులలోనే మధ్యాహ్నం భోజనం కార్మికులను, విఒఎలపై రాజకీయ వేధింపులు, తొలగింపులు మొదలయ్యాయన్నారు. మిగిలిన అంగన్వాడీ ,ఆశాలుగా పనిచేస్తున్న వారిపై కూడా రాజకీయ వేధింపులు మొదలయ్యాయన్నారు. తక్షణం ప్రభుత్వ అధికారులు ఇటువంటివి మాను కోవాలని, లేనిపక్షంలో స్కీం వర్కర్లందరూ సంఘటిత పోరాటాలకు సిద్ధంగా ఉండాలని, అందుకు గ్రామ వీధుల నుండే ప్రారంభం కావాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు జె.నాగేశ్వరరావు, సుధాకరప్ప, ఆర్పీల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి, అంగన్వాడీ యూనియన్ నాయకులు బాలదర్గమ్మ, కృష్ణ వేణి, సువర్ణ, రాధిక, మధ్యాహ్నభోజన కార్మిక సంఘం నాయకురాలు రజీయా, ఆశా యూనియన్ నాయకురాలు శోభారాణి, స్కూల్ స్కావెంజర్స్ జయలక్ష్మి, స్కూల్ నైట్ వాచ్ మెన్ యూనియన్ నాయకులు రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్

పర్యావరణాన్ని కాపాడాలి : ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్ మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్యాలయం సమీపంలో మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత తో పాటు నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్,. మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి ఎంపిడిఒ మల్లీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ మొక్కలను పెంపకం చేపట్టి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మొక్కల పెంపకానికి పెద్ద ఎత్తున ప్రాధాన్యత కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మోహన్ రెడ్డి, విశ్వేశ్వర రెడ్డి ,ఎపిఒ సాయి నాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఓర్వకల్లులో మొక్కలు నాటుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు

వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వర్సిటీ పరిధిలోని హాస్టల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ పేర్కొన్నారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని హాస్టల్లో ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు తయారుచేసిన ఆహారాన్ని పరిశీలించి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల నుండి తనకు ఏదైనా సమస్య తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. వర్సిటీలోని గ్రంథాలయాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.అనంతరం లైఫ్ సైన్స్ విభాగాన్ని పరిశీలించి అక్కడ విద్యార్థులు అధ్యాపకుల హాజరు నమోదును తనిఖీ చేశారు.



యూనివర్సిటీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎన్‌టికె నాయక్

జాయింట్ కలెక్టర్ల బదిలీ

నంద్యాల జెసిగా విష్ణుతేజ-కర్నూలు ఇంకా ప్రకటించలేదు

ప్రజాశక్తి - కర్నూలు/నంద్యాల కలెక్టరేట్

కర్నూలు, నంద్యాల జిల్లాల జాయింట్ కలెక్టర్లు బదిలీ అయ్యారు. కర్నూలు జెసి నారపురెడ్డి మౌర్య, నంద్యాల జెసి టి,రాహుల్ కుమార్ రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న నారపురెడ్డి మౌర్యను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల జెసిగా పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి విష్ణుతేజను నంద్యాల నియమించారు. ప్రస్తుత నంద్యాల జెసిని సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. కర్నూలు జెసిగా ఎవరనేది ఇంకా ప్రకటించలేదు.

కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ బదిలీ..

కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ బదిలీ అయ్యారు. ఆయనను గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కర్నూలు కమిషనర్‌గా కొత్తవారిని ఇంకా ప్రకటించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదట ఐఎఎస్, ఐపిఎస్, ఆతరువాత జాయింట్ కలెక్టర్ల బదిలీ ప్రక్రియను చేపట్టింది.



తెగిపోయిన మణికట్టు, యధాస్థితికి అతికించిన మెడికవర్ వైద్యులు

తెగిపోయిన మణికట్టుకు శస్త్ర చికిత్స

మరల చేతికి ముందులా అతికించిన మెడికవర్ వైద్యులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గంగ రాజు చెయ్యి క్రేన్ కింద పడి మణికట్టు చేతి నుంచి తెగి పడిపోయింది. హుటా హుటిన వెంటనే కర్నూలు లోని మెడికవర్ హాస్పిటల్స్‌కు అర్థరాత్రి ఎమర్జెన్సీలో చేర్పించారు. డాక్టర్ పార్వతి (ప్లాస్టిక్ సర్జన్), డాక్టర్ బాల ప్రవీణ్ (అనేస్తేషియాలోజిస్ట్), డాక్టర్ కావ్య (అనేస్తేషియాలోజిస్ట్), డాక్టర్ మంజునాథ్ (ఆర్థోపెడిక్ సర్జన్) ఉదయం 6 గంటలలోపు సర్జరీ చేయకుంటే ఈ చేతిని అతికించడం కుదరదు అని వెంటనే సర్జరీ మొదలు పెట్టారు. సర్జరీ ఉదయం 1 గంటల నుండి 6 :30 గంటల వరకు సుమారు 6 గంటల వరకు చేశారు. ఎముకలు, కండరాలు నరాలను వాటి స్థానాలలో అనుసంధానించారు. చివరికి తెగి పడిన మణికట్టును యధా స్థానానికి అమర్చారు. ప్రస్తుతం చేతి కండరాలు మణికట్టు కండరాళ్ళకు అతికించబడ్డాయి. 8 రోజుల తరువాత చేతి కదలికలు మెరుగు పడ్డాయి. ఇప్పుడు గంగ రాజు తన చేతి వేళ్ళను కదిలించగలుగుతున్నారు. ఇంత పెద్ద ప్లాస్టిక్ సర్జరీ సమయానికి అందించి చేతిని ముందులా మార్చినందుకు గంగ రాజు డాక్టర్ పార్వతికి హృదయ పూర్వక ధన్య వాదాలు తెలిపారు. ఎవరైనా ఇలా తెగి పడిపోయిన కండరాలు జాగ్రత్తగా 1 నుండి 2 గంటల లోపు జాగ్రత్తగా తీసుకొని వస్తే వాటిని అతికించగమని వైద్యులు తెలిపారు.అనంతరం మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మా వైద్యులు 24 /7 పేషెంట్ కు అందుబాటులో ఉండటం వల్లనే ఉదయం 1 గంటలకే ఎమర్జెన్సీ లో వైద్యులు వెంటనే సర్జరీ చేయడం వలన గంగ రాజు చేయి ముందులా వైద్యులు అమర్చారన్నారు. సర్జరీ ని విజయ వంతంగా పూర్తి చేసినందుకు వైద్యులను అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్కలు నాటిన ఎంపిడిఒ

ప్రజాశక్తి- సి బెళగల్

సిబెళగల్ కేంద్రంలో గల 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపిడిఒ శకుంతల శనివారం మొక్కలు నాటించారు. పర్యావరణ పరిరక్షణ మానవాళికి రక్షణ అని ఆమె పేర్కొన్నారు. మొక్కలు నాటుటకు మన అందరి బాధ్యత అని ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం తాగునీటి పథకాలను, పరిసరాలను పరిశీలించి సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త పడాలని ప్రజలకు సూచించారు.



జాగ్రత్తలు పాటించండి

విద్యుత్ ప్రమాదాలను నివారించండి: ఎస్ఇ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఉభయ జిల్లాల్లో ఉన్న విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. ఉమాపతి అన్నారు. శనివారం విద్యుత్ భవన్లోని ఎస్‌సి కార్యాలయం చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారులు వారి ఆవరణలోని అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్ వైర్లు స్విచ్లు హోల్డర్లు , పరికరాలను నాణ్యత (ఐఎస్ఐ) మార్కు కలిగిన వాటిని ఉపయోగించడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. వినియోగదారులు ఇంటిలోనే స్విచ్ బోర్డులను భద్రత ప్రమాణాలు పాటిస్తూ తగినంత ఎత్తులో అమర్చుకోవాలన్నారు. విద్యుత్ సర్వీస్ కోసం వినియోగించే సర్వీస్ వైరు నాణ్యమైన , లోటుకు అనుగుణంగా తగు కెపాసిటీ వాడినట్లయితే విద్యుత్ సరఫరాలో అంతరాయాలను ఓల్టేజ్ హెచ్చుతగ్గులను నివారించవచ్చని అన్నారు. విద్యుత్ సర్వీసును ఇంటిలో ఉపయోగించే పరికరాలను తప్పనిసరిగా ఎర్త్‌పైపు ద్వారా ఎర్తింగును ఏర్పాటుచేసి ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు ముట్టుకోరాగన్నారు. ఇల్లు ఇతర నిర్మాణాల ప్రదేశంలో విద్యుత్ లైన్లు విద్యుత్ స్తంభాలు ఉన్నచో విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం తగిన దూరం పాటించి నిర్మాణాలను చేపట్టాలని చెప్పారు. తడి చేతులతో ,తడికాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదని అన్నారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి మాత్రమే సంప్రదించాలన్నారు. ఇతర ప్రైవేటు వ్యక్తుల ద్వారా పనులు చేయించరాదన్నారు. ఇళ్ల డాబాలపై బట్టలు ఆరవేసేటప్పుడు ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పుడు ఇళ్లపైన సమీపాన విద్యుత్తు లైన్లో విద్యుత్ నిబంధనల ప్రకారం తగినంత దూరం పాటించాలన్నారు. కొబ్బరి , పామాయిల్ మొదలగు తోటలలో కొమ్మలు తొలగించుటప్పుడు విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్ ముందుగా తెలియజేస్తే లోకల్ విద్యుత్ సిబ్బంది ద్వారా లైన్ క్లియర్ ఏర్పాటు చేసి వారి పర్యవేక్షణలో పనిచేయవచ్చన్నారు. తొందరపడి ప్రమాదాలకు గురికా వద్దన్నారు. వీధి దీపాలనకు సంబంధించిన ఫీజు వైర్ల మరమ్మతులకు లైన్ క్లియర్ చేసుకుంటే తప్ప పాడైన స్విచ్లు, బల్బులు మార్చుట మొదలు వాటిని అనుమతించిన సిబ్బంది మాత్రమే చేయాలన్నారు. తోటలలో గాని పొలాల్లో కానీ ఇతర ఏ ప్రదేశాల్లోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగిపడి ఉంటే వాటిని నేరుగా తాకరాదని, వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 నెంబరుకు తెలియజేయాలని అన్నారు . ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనిస్తే ఆ వ్యక్తి గాని విద్యుత్ పరికరాన్ని గాని నేరుగా తాకరాదని, వెంటనే దగ్గరలోని విద్యుత్ అధికారి లేదా సిబ్బందికి తెలపాలన్నారు. పారిశ్రామిక ,వాణిజ్య వినియోగదారులు, విద్యుత్ పరికరాలను రిపేరు చేయువారు విద్యుత్తు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడినా, తీగలు పడిపోయిన , గాలి వానలకు విద్యుత్ స్తంభాలు పడిపోయినా వెంటనే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కానీ, విద్యుత్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యుత్ వినియోగదారులు పాటించాల్సిన భద్రత సూచనలను సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, ఎస్ఐ విశ్వనాథ్, టెక్నికల్ డిఇ ఓబులేసు, కమర్షియల్ డిఇ విజయభాస్కర్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్ఇ, ఇతర అధికారులు

జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌కు ఎన్ఎబిహెచ్ సర్టిఫికెట్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని స్థానిక బస్టాండ్ ఎదురు నందు గల జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ కు స్థాపించిన 9 నెలల్లోనే ప్రతిష్టాత్మకమైన ఎన్ఎబిహెచ్ (NABH Entry Level - Hospital Certificate) సర్టిఫికెట్ లభించిందని జెమ్‌కేర్ హాస్పిటల్ ఎండి, సిఇఒ డాక్టర్ ఎస్‌వి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ గుర్తింపు రోగులకు భద్రత , అధిక నాణ్యత గల ఆరోగ్య సంరక్షణ అందించడంలో ఉన్నత ప్రమాణాలను పాటించడం వల్ల వస్తుందన్నారు. ఎన్ఎబిహెచ్ నుంచి వచ్చిన ఈ గుర్తింపు బోర్డు నిర్దేశించిన భద్రత, నాణ్యత ఖచ్చితమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉందని వాస్తవాన్ని తెలుపుతుందన్నారు. ఎన్ఎబిహెచ్ అనేది భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో భాగం అన్నారు. ఇది ఆస్పత్రుల, ఆరోగ్య సంరక్షణ సంస్థల కోసం అక్రిడేషన్ ప్రోగ్రాం నిర్వహించే స్వయం ప్రతిపత్తి సంస్థ అని అన్నారు. నవంబర్ 2023లో అప్లికేషన్ పెట్టగా ఏప్రిల్ 24 లో ఇన్‌స్పెక్షన్ చేసి ఈనెల 7న అక్రిడేషన్ జారీ చేశారన్నారు. ఈ సర్టిఫికెట్ వ్యాలిడిటీ రెండు సంవత్సరాలు అంటే 2026 జులై వరకు ఉంటుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ధ్రువీకరణ కార్యక్రమంలో ఎండి ,సిఇఒ ఎస్‌వి చంద్రశేఖర్ , సిఒఒ డాక్టర్ గణేష్, అన్ని విభాగాల డాక్టర్ లు, సిబ్బంది ఎన్ఎబిహెచ్ కోఆర్డినేటర్ నదీమ్, మార్కెటింగ్ డిజిఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎబిహెచ్ సర్టిఫికెట్ చూపుతున్న జమ్‌కేర్ కామినేని ఎండి డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ ఇతర వైద్యులు



గూడూరు బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసి వివరాలు సేకరిస్తున్న ఆర్‌డిఒ

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గూడూర్

గూడూరు బాలికల హాస్టల్‌ను శనివారం ఆర్‌డిఒ శేషిరెడ్డి గూడూరు మున్సిపల్ కమిషనర్ రవికుమార్ రెడ్డి మున్సిపల్ ఎఇ నరసింహులు హాస్టల్‌ను తనిఖీ చేసి హాస్టల్ వార్డెన్ మాధవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గత సంవత్సరం నుండి హాస్టల్ పై కప్పులు ఊడినట్లు విద్యార్థులకు చాలా ఇబ్బంది ఉన్నట్లు హాస్టల్ వార్డెన్ మాధవి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లగా పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి పై అధికారులు పరిశీలిస్తారని చెప్పటంతో శనివారం ఆర్‌డిఒ పరిశీలించి బాలికలకు స్నానపు గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సమస్య పరిశీలించి ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. త్వరలోనే బాలికల హాస్టల్ రూప రేఖలు మారుస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట ఎంఇఒ సుశీలమ్మ తదితర అధికారులు ఉన్నారు.



డిఐజి ,కలెక్టర్,ఎస్‌పిలను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మంత్రాలయం

కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్‌పి బింధు మాధవ్ లను ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం కర్నూలు చేరుకున్న ఎమ్మెల్యే, వైసిపి మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి ఆయన పిఎ వెంకట్రామిరెడ్డి లతో కలసి డిఐజి, కలెక్టర్, ఎస్పీలను వేరు వేరుగా తమ ఛాంబర్‌లకు వెళ్లి కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు, బోకేలను జ్ఞాపకలను, రాఘవేంద్రస్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

బిసి బాలికల హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలి : ఎస్‌ఎఫ్‌ఐ



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

బీసీ బాలికల ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని స్థానిక సుందరయ్య భవన్ నందు ఎస్‌ఎఫ్‌ఐ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బీసీ ప్రిమెట్రిక్ హాస్టలుకు సొంతభావనలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నాము అని పత్రిక ప్రకటనలు ఇవ్వటం తప్పితే వాటి అమలు చేయటంలో విఫలమైందన్నారు. అందులో సంక్షేమ హాస్టళ్లలో చదివే పేద బడుగు బలహీనర్గాలకు చెందిన విద్యార్థుల పరిస్థితి మరి దారుణంగా ఉందన్నారు. కర్నూల్ జిల్లా అభివృద్ధిలో వెనకబడిన ప్రాంతం నిరంతరం ప్రజలు దూర ప్రాంతాలకు వలసలు వెళ్తుంటారని, అలా వలసలకు వెళ్ళే క్రమంలో తమ పిల్లలను సంక్షేమ హాస్టల్లో వదిలితే వారి భవిష్యత్ బాగుంటుందని భావించిస్తుంటారని తెలిపారు. జిల్లాలో బాలికల హాస్టల్ లో చాలా ప్రాంతాలలో లేకపోవటంతో ఎమ్మిగనూరులోని బీసీ ప్రిమెంట్రిక్ హాస్టల్ తమ పిల్లలను ఈ హాస్టల్ లో చేర్పించాలని జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల నుండి తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్లో వదిలి ఎమ్మిగనూరుకి వస్తున్నారని తెలిపార. ఈ హాస్టల్ ప్రైవేట్ భవనం కావటం వల్ల ఈ సంవత్సరం ఈహాస్టల్ లో 450 విద్యార్థులు ఉన్నారుని, అంతకు మించి ఆ భవనంలో విద్యార్థులు సదుపాయాలు అందించలేము అని హాస్టల్ వార్డన్ హరిత దేవి తమ దృష్టికి తీసుకొని వచ్చిందన్నారు. హాస్టల్ సర్వే చేసినప్పుడు హాస్టల్ కేవలం 11 గదుల్లో ఒక్కొక్క గదికి 40 మంది విద్యార్థినిలు వుంటున్నారని, వీరందరికీ కేవలం 10 బాత్ రూములు, 10 టాయిలెట్లు ఉన్నాయన్నారు. అలాగే నిద్ర పోయే టైంలో విద్యార్థులు వారి ట్రంక్ పెట్టెలను ఒకదానిమీద ఒకటిపెట్టి నిద్రపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇంకా 380 మంది విద్యార్థులకు సీట్లు అలాట్మెంట్ కాకపోవటంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీనంతటికీ కారణం జిల్లా స్థాయి అధికారుల లోపమేనని, జిల్లాలోని అన్ని ప్రాంతాలలో సంక్షేమ హాస్టల్లు ఏర్పాటు చేస్తే ఎక్కడిక్కడే విద్యార్థులు తమ చదువులను కొనసాగించేవారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో హాస్టళ్లు నిర్మించాలని అలాగే ఎమ్మిగనూరులో గతంలో ఉన్న ఎన్టీఆర్ కాలనిలో ఎస్సీ, బీసీ ప్రిమెట్టిక్ హాస్టల్లు పాత భావనలు ఉన్నా చోట ఇప్పుడుకొత్త ఎస్సీ, బీసీ, ప్రిమెట్రిక్ హాస్టల్లకు సొంతభవనాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విజయ్, నాయకులు అగ్గి రాముడు, అభి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - ఆస్పరి

పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలను తక్షణమే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి ఆధ్వర్యంలో సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకుబీమా పరిహారం రైతు ఖాతాలోకి జమ చేయాలని, రెండు లక్షల వరకు రైతులకు బ్యాంకు రుణాలు మాఫీ చేసి, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతు కార్డులు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల జాబ్ కార్డుకు 200 రోజులకు పెంచి, రోజువారి కూలీ 600 రూపాయలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 9 వారాల ఉపాధి హామీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి జంప్ల నాయక్, వీఆర్వో హరి నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు మాణిక్యప్ప, రామాంజనేయులు, రాముడు, రంగస్వామి, నాగరాజు,రంగన్న పాల్గొన్నారు.


ఆలూరులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆలూరు : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలని ఏపి రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, సిఐటియు సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మూడో సచివాలయం వ్యవసాయ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రైతులకు 2023 సంవత్సరం లో పంటల బీమా ఇవ్వాలని, కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రబీ లోని నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకం పని దినాలు 200 రోజులు కేటాయించి రోజు వారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, ఉపాధి పెండింగ్ బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సేకన్న, నాగన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




ఆస్పరిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తుంగభద్ర కు పోటెత్తిన వరద

102745 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో -72 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

ప్రజాశక్తి - హోళగుంద



కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ, దవనగిరి, రాణి బెన్నూర్, తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్ కు వరద పోటెత్తింది ప్రస్తుతం రోజుకు 102745 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. గత వారం రోజులుగా రోజుకు 30,వేల నుండి 40,000 క్యూసిక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం తుఫాను ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తుండడంతో రోజుకు 102745 వేల వరకు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు బోర్డ్ సెక్షన్ అధికారి రాఘవేంద్ర శనివారం తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్ లో 72 టిఎంసిలు నీటి నిల్వ ఉంది. ఈ రెండు మూడు రోజుల్లో ఋతుపవనాల కారణంగా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. గత ఏడాది జులై నెలలో 11425 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండేది .ఈ ఏడాది అయితే ఈ ఏడాది జూలై నెలలో108556 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో మొదలు కావడంతో త్వరలో డ్యాం లోకి పూర్తి సాయి నీటిమట్టం నీరు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. తుంగభద్ర డ్యాం , ఎల్ఎల్‌సి కాల్వపై ఆధారపడిన రైతులు తమ పొలాల్లో దుక్కు దున్నులు మొదలుపెట్టారు. గత ఏడాది వర్షాలు లేక బెంగళూరు బొంబాయి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన రైతులు సైతం గ్రామాలకు వచ్చి చేరుకొని తమ తమ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. గత రెండు రోజుల క్రితం ఎల్ఎల్‌సికి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. తుంగభద్ర డ్యామ్ కు ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే నాలుగు రోజుల్లో తుంగభద్ర డ్యామ్ కు గరిష్ట సాయి నీటిమట్టం 105 టిఎంసిలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు బోర్డ్ అధికారులు పేర్కొన్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య సర్వసభ్య సమావేశం

- సమస్యల పరిష్కారానికి పోరాడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోని రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి మండల సర్వ సభ్య సమావేశం కావడంతో ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, 15 మంది కానిస్టేబుల్‌తో బందోబస్తు మధ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు.శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దానమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ మధుసూదన్, జెడ్పిటిసి అరుణ పాల్గొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మరోసారి 45 రోజులకు ఒకసారి జరిగే విధంగా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించే దిశగా గ్రామంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచులు, ఎంపిటిసిలు గట్టిగా పోరాడి గ్రామ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించి అధికారులు శాఖల వారిగా సంక్షేమ పథకాలను వివరించారు. పాండవగల్ గ్రామంలో పాఠశాల ఆవరణంలో నీరు ఆగు తున్నాయని అందువలన పాఠశాలకు రాకపోకలు ఇబ్బంది అవుతుందని అలాగే ఆ గ్రామంలో స్కూల్ ఐదవ తరగతి వరకు మాత్రమే ఉందని ఎనిమిదవ తరగతి వరకు పెంచాలని గ్రామ సర్పంచ్ ఉమాదేవి కోరారు. పాఠశాలలో విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి కానీ అసలైన విద్య మాత్రం అందటం లేదనిసర్పంచ్ సువర్ణ అన్నారు.ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ పేద ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి పోకుండా చికిత్స కోసం కార్పొరేట్ హాస్పిటల్‌కి వెళ్లి అప్పులు బారిన పడుతున్నారని, అలా వెళ్లకుండా ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందేందుకు అవగాహన కల్పించాలని డాక్టర్లకు సూచించారు. కొందరు ఆశ వర్కర్లు ప్రభుత్వ హాస్పిటల్లకు రోగులను పిలుచుకుపోకుండా కార్పొరేట్ హాస్పిటల్‌కు కమిషన్ల కోసం తీసుకెళ్తున్నారని, ఇలా కాకుండా ప్రతి ఒక్కరు ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స చికిత్స పొందే విధంగా అవగాహన కలిగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం హాయంలో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన ఆర్‌బికెలలో యూరియా తప్ప రైతులకు ఎటువంటి రసాయనిక ఎరువులు దొరకడం లేదని అన్నారు. అలాగా కాకుండా ఆర్‌బికే కేంద్రంలో రైతులకు అవసరమయ్యే ఎరువులను అందించే విధంగా చూడాలని అన్నారు. ఆదోని నియోజకవర్గంలో జల జీవన్ పథకం ప్రతి ఇంటికి అందించేందుకు రూ.77, కోట్లు ఖర్చు అవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిదుర మంజూరు చేయాల్సి ఉంటుందని నిధులను తెప్పించే బాధ్యత తీసుకొని మంత్రులతో మాట్లాడి ప్రతి ఇంటికి కూడా అయ్యే విధంగా చర్యలు తీసుకుందామని అధికారులకు తెలిపారు. ఆదోని అభివృద్ధి చేసేందుకు ఒక సంవత్సరం గడువు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ నూర్జహన్, డిఎల్‌డిఓ నాగేశ్వరరావు, ఎంపీడీవో రాజశేఖర్,వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, కోఆప్షన్ మెంబరు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుల దురహంకారులను అరెస్ట్ చేయాలి

కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు

ప్రజాశక్తి -ఆదోని



బాధితుడిని పరామర్శిస్తున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు

దళితులపై దాడి చేస్తున్న కుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆదోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళితున్ని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, బి. తిక్కప్ప, నాయకులు రామాంజిని, పరమేష్, వీరేష్ లు కలిసి పరామర్శించి మాట్లాడారు. మోహర్రం సందర్భంగా అందరితోపాటు అలాయి వద్ద ఉన్న రంగప్పను మాతోపాటు కలిసి సావుసోని ఎలా ఆడతావ్ అని కులం పేరుతో దూషిస్తూ ముఖంపై గుద్ది దాడి చేశారన్నారు. మొహర్రం రాత్రి దాడికి గురైన రంగప్ప అవమానభారంతో ఇంట్లో ఎవరికీ విషయం చెప్పలేదన్నారు. ఉదయం లేచి చూస్తే ముఖంపై గాయాలు ఉండడంతో ఏమైంది అని విషయం తెలుసుకున్న భార్య నాగమ్మ, కుమారుడు నాగరాజులు దాడి చేసిన వారి వద్దకు వెళ్లి ఎందుకు మా నాన్నను కొట్టావు అని అడిగితే, నీకేం రా చెప్పేదంటూ దాడి చేయడమే గాక రాయితో నెత్తికి కొట్టి చంపే ప్రయత్నం చేశారన్నారు. అడ్డుగా వెళ్లిన నాగమ్మను గొంతు పిసికి, తాళి తెంచి అసభ్యంగా ప్రవర్తించారన్నారు. దాడి జరిగి మూడు రోజులైనా విచారణ పేరుతో నేటికీ కేసు కట్టలేదని, దళితులపై దాడి చేసిన వెంకటేష్, భీమేష్, గణేష్, ఉరుకుందులపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టంతోపాటు, హత్యాయత్నం, అత్యాచారాల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు.

తుంగభద్ర తీరప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ శ్రీధర్ మూర్తి

ప్రజాశక్తి-మంత్రాలయం :



తుంగభద్ర నదికి వరద నీరు పెరగడంతో డ్యాం నుంచి గేట్లు ఎత్తి ఏ క్షణంలోనైనా నీరు విడుదల చేయవచ్చని, నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీధర్ మూర్తి హెచ్చరికలు జారీ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు విఆర్వోలకు, విఆర్ఏలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు అందరూ కూడా తమ తమ గ్రామాల్లో ప్రజలకు దండోరా ద్వారా, దేవాలయాల్లో చర్చీల్లో మసీదుల్లో గల మైకుల ద్వారా తెలియజేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించామన్నారు. ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. మండల పరిధిలోని నారాయణపురం, కాచాపురం, రాంపురం, మాధవరం, చెట్నేహళ్లి, మంత్రాలయం గ్రామాల విఆర్ఓలు, విఆర్ఏలకు ప్రజలను అప్రమత్తం చేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తుంగభద్ర తీరంలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -కౌతాళం

మండల పరిధిలోని తుంగభద్ర నది తీరంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం నికి రూ.ఒక లక్ష 27 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండడంతో, తుంగభద్ర నదికు వరద నీటిని ఎప్పుడైనా విడుదల చేయవచ్చుఅన్నారు. నదితీరంలో పశువుల కాపరులు, రైతులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామానికి సంబంధించిన అధికారులు ప్రజా ప్రతినిధులు దండోరా వేయించి, దేవాలయాలకు సంబంధించిన మైకుల ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని కోరారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్

డివైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

డివైఎఫ్ఐ ఎమ్మిగనూరు పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మహేష్, సురేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో భగత్ సింగ్ భవనంలో డివైఎఫ్ఐ పట్టణ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో 1980వ సంవత్సరం పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా నగరంలో అందరికీ విద్య అందరికీ ఉపాధి కావాలంటూ భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ సంఘాన్ని స్థాపించారని తెలిపారు. నేటి నుండి నాటి వరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు, మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశంలోనే అతిపెద్ద యువజన సంఘం డివైఎఫ్ఐ ఎదిగిందని తెలిపారు. అనంతరం డివైఎఫ్ఐ నూతన పట్టణ కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మహేష్, సురేష్, సహాయ కార్యదర్శులుగా వీరేష్, గురు, రవి, ఉపాధ్యక్షులుగా శేఖర్ మోహిన్, రమేష్, కమిటీ సభ్యులుగా భీమేష్ రాకేష్, అభిషేక్ చాంద్, రాజేష్, కుమార్‌తోపాటు మరో పదిమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పురస్కానికి ఎన్నికైన మంత్రాలయం వాసి

ప్రజాశక్తి-మంత్రాలయం



ఛత్రపతి శివాజీ హైందవ శ్రేష్ట పురస్కారానికి మంత్రాలయం గ్రామ నివాసి సూర్య నారాయణాచార్యులను ఎంపిక చేసినట్లు హిందూ ఉపాధ్యాయ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మహేష్ డేగల, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కురువ చంద్రశేఖర్ నుంచి సమాచారం అందినట్లు పురస్కార గ్రహీత సూర్య నారాయణాచార్యులు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందూ ఉపాధ్యాయ సమితి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వ్యాస పౌర్ణమి పురస్కరించుకొని ప్రతి ఏటా సంస్థ నుండి ఉత్తమ ఉపాధ్యాయులకు , ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమంలో ప్రతిభ కనబరచిన ప్రముఖులకు హిందూ ధార్మిక సమితి పేరుపైన వ్యాస పురస్కారాలను ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. అందులో భాగంగానే జిల్లా కేంద్రం లోని టీజీవి కళాక్షేత్రంలో ఆదివారం వ్యాస పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర స్థాయిలో విద్యా వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ రాష్ట్రాల్లోని 118 మంది ఉపాధ్యాయులకు వ్యాస పురస్కారాలు, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపిన 29 మందికి ఛత్రపతి శివాజీ హైందవ శ్రేష్ట అనే పురస్కారాలను ఇచ్చి సత్కరించనున్నారని తెలిపారు. తనకు ఛత్రపతి శివాజీ హైందవ శ్రేష్ట పురస్కారం లభించడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఉరుకుందలో వేలం పాట

టెంకాయలు వేలం రూ.64 లక్షలు

ప్రజాశక్తి-కౌతాళం

మండల పరిధిలోని ఉరుకుంద లో వెలసిన శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం లో వేలం పాటలు శనివారం నిర్వహించారు. శ్రావణమాస ఉత్సవాలలో భక్తులకు సేవల కోసం పలు వాటికి దేవస్థానం అధికారులు వేలం పాటల కు ఆహ్వానించారు. ఈ టెండర్, షీల్డ్ టెండర్ , బహిరంగ వేలం పాటలకు ఆదోని దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ హెచ్. జి వెంకటేష్ వేలం పాటలు నిర్వహించారు. ఒక సంవత్సరం పాటు పుణ్యక్షేత్రంలో టెంకాయలు అమ్ముకోవడానికి, అరచిప్ప పోవడానికి ఇద్దరు కోడ్ చేశారు. వారిలో కె. ముత్తన్న, ఊరుకుంద వారు రూ.64,00,062, హెచ్చు పాటదారునిగా నిలిచారు. దేవాలయానికి పేపర్ రోల్స్ సరఫరాకు ఇద్దరు కోడ్ చెయ్యగా వారిలో వైభవ్ బుక్ సెంటర్ వారు తక్కువ కోడ్ చేసి తక్కువ టెండర్ ధారునిగా నిలిచియున్నారు. విద్యుత్ సామాగ్రి, ప్లంబింగ్ సరుకులు సరఫరా చేయడానికి ఇద్దరు కోడ్ చేయగా వారిలో కె.ప్రసాద్ వారు తక్కువ కోడ్ చేసి తక్కువ టెండర్ ధారునిగా నిలిచారన్నారు. సప్లయర్ సామాగ్రి కోసం ఇద్దరు కోడ్ చేయగా వారిలో కె.వీరేష్, ఊరుకుంద గ్రామస్తుడు తక్కువ కోడ్ చేసి తక్కువ టెండర్ ధారునిగా నిలిచారు. శ్రావణమాసంలో ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా కోసం ఇద్దరు కోడ్ చేయగా, కె. వీరాంజినేయులు తక్కువ కోడ్ చేసి తక్కువ టెండర్ ధారునిగా నిలిచారు. మొబైల్ టాయిలెట్స్ కోసం ఇద్దరు కోడ్ చెయ్యగా, వారి వద్ద డాక్యుమెంట్ పరిశీలించి ప్రకటించడం జరుగుతుందన్నారు. సులబ్ కాంప్లెక్స్, స్వామివారి , పూలు, పూజ సామాగ్రి , చెప్పుల స్టాండ్ నిర్వహణ, శ్రావణమాసం అన్నదానం నిర్వహణ, కు టెండర్ ధారులు ఎవరు పాల్గొనక పోవడంతో వేలం పాటలు వాయిదా వేసినట్లు డిప్యూటీ కమిషనర్ హెచ్‌జి .వెంకటేష్ పేర్కొన్నారు.ఎలాంటి ఆలోచన జరగకుండా సిఐలు ప్రసాద్, ఎరిషావలి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు

గాయత్రి మాత వడ్డాణం అపహరణ


అపహరించిన వడ్డాణం

ప్రజాశక్తి-ఆస్పరి : మండల పరిధిలోని రామతీర్థం కొండల్లో కొలువైన శ్రీపంచముఖి గాయత్రి మాత ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి కేజీ వెండి వడ్డాణం అపహరించి నట్లు అర్చకులు రూపం మోహన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం 11 గంటల వరకు ఆలయంలో ఉండి గుడి తాళాలు వేసి ఇంటికి తిరిగి వెళ్ళానన్నారు. ఉదయం లేచి చూసేసరికి వేసిన తాళాలు వేసినట్టుగానే ఉంది. గర్భగుడిలోకి వెళ్లి చూస్తే అమ్మవారి నడుముకు అలంకరించిన వడ్డానం కనపడక పోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సిఐ.హనుమంతప్ప తెలిపారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని


బిసి బాలికల హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అసెంబ్లీ పరిధిలోని అన్ని ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శనివారం ఆదోనిలోని విక్టోరియా పేటలోని మహాత్మా గాంధీ గుజరాతి స్కూల్లో ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్సీ మధుసూదన్, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు ఏళ్ళుగా ఆదోనిలో బిసి బాలికలకు ప్రత్యేక హాస్టల్ లేకపోవడంతో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థినులకు వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామీణ విద్యార్థినిలు రోజువారీగా పాఠశాలలకు వాహనాల్లో ప్రయాణం చేయలేక మధ్యలోనే చదువు మానేసే పరిస్థితి ఉందన్నారు. 150 మంది విద్యార్థినిలు హాస్టల్ వసతి కోసం దరఖాస్తు చేసుకున్నారని, నాణ్యమైన భోజనం, మంచి త్రాగునీరు, విద్యార్థులకు బెడ్ షీట్లు, సిబ్బంది ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ భవనాల కోసం ఇంజనీర్ సెక్షన్ ద్వారా ప్లాన్ వేయించి విజయవాడలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని సాధించేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. హాస్టళ్లను మార్పు చేసి చూపిస్తామన్నారు. బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండగిరి బిసి హాస్టల్‌కు రూ.13.5 లక్షలు, పెద్దకడబూరు బీసీ హాస్టల్ భవనాలకు రూ.14 లక్షలు చొప్పున మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. జిల్లాలో 41 హాస్టళ్లు ఉన్నాయని ఉద్యోగుల కొరత ఉందని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అవసరమున్న చోట సొంత భవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని త్వరలోనే ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఏఎస్‌డబ్ల్యూఓ, వార్డెన్లు విశ్వనాథ్ రెడ్డి, ప్రమీలమ్మ, అనిమి రెడ్డి పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని 44 గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి సమస్య ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడుతూ తక్షణమే గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా టాంకర్ల ద్వారా సరఫరా చేయాలని మండలంలోని పెద్ద తుంబలం గ్రామానికి ఎస్ఎస్ ట్యాంకు వెడల్పు లేదా అదనపు ట్యాంక్ నిర్మాణం చేయాలన్నారు. కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంక్‌కు ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలని, కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంక్ నుండి పాండవగల్లు గ్రామం వరకు రెండవ పైప్‌లైన్ వెయ్యాలని కోరారు. నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంక్ నుండి బసరుకోడు వరకు అదనపు పైప్ లైన్ వేయాలని, చిన్న హరివాణం ఎస్ఎస్ ట్యాంక్ నుండి సంతేకుడ్లూరు,గ్రామాలకు తక్షణమే పైప్‌లైన్ వేసి తాగునీరు అందించాలన్నారు. ఎల్ఎల్‌సి కాల్వ వచ్చిన వెంటనే అన్ని ఎస్ఎస్ ట్యాంకులను అదనపు మోటార్ల ద్వారా నీళ్లు వేగవంతంగా పంపింగ్ చేయాలని, పై డిమాండ్లన్నింటినీ సమావేశంలో తీర్మానం చేయాలని, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు నాగేంద్ర, రామాంజనేయులు, ఖాదర్ బాషా మునిస్వామి, ముకప్ప పాల్గొన్నారు.

బకాయిలను త్వరగా చెల్లించండి

- సొసైటీ సిఇఒ హరికృష్ణ

ప్రజాశక్తి - చిప్పగిరి

1సొసైటీ బ్యాంకులో బకాయిలు ఉన్న రైతులందరూ త్వరగా చెల్లించాలని, లేనిపక్షంలో వారికి నోటీసులు అందజేస్తామని సిఇఒ హరికృష్ణ తెలిపారు. శనివారం బెల్డోన సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ప్రత్యేక అధికారి ఎం.రామరాజు ఆదేశాల మేరకు సొసైటీలో రుణాలు పొందిన రైతులందరూ కూడా సకాలంలో బకాయిలను చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. సొసైటీలో మొత్తం 2400 మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారన్నారు. రుణాలు పొందిన రైతులు 950 ఉన్నారన్నారు. మొత్తం సొసైటీలోరూ. 24 కోట్ల టర్న్ వర్ ఉండగా రూ.6 కోట్ల 32 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. సొసైటీలో సభ్యత్వం పొందిన వారందరూ కూడా తమ ఆధార్ నెంబరును పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు ఎకౌంటు పుస్తకం, పాన్ కార్డు జిరాక్స్ కాపీలతో సొసైటీ బ్యాంకు సిబ్బందితో ఆన్లైన్లో నమోదు చేయించుకోవాలని కోరారు.